# కొనసాగుతున్న బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



బాలాజీనగర్ కాలనీలో యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డికి ఓటువేయాలని కోరుతున్న ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డి



ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ అభిమానులు

సైదాబాద్, నవంబర్ 23 : యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సామ సుందర్ రెడ్డికి కాలనీవాసులందరూ ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డి పలు కాలనీల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, న్యూ బాలాజీ నగర్‌ల్లో గడప గడపకు వెళ్లి ఓటర్లు, కాలనీవాసులను కలిసి కారు గుర్తు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు, బలహీల వర్గాల ప్రజల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారందరూ బీఆర్ఎస్‌కు ఓటు వేయటానికి సన్నద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ హ్యాట్రిక్ విజయంతో సీఎం కావటం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజలంతా అభివృద్ధిని కోరుకుంటున్నారని, స్కాములు చేసే కాంగ్రెస్, మతతత్వ బీజేపీలకు తగిన బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. ఆ రెండు పార్టీలు పరాజయానికి సిద్ధమై ప్రచారంలో ఎక్కడ కన్పించటంలేదన్నారు. వారికి ప్రజలు తమ ఓటు ద్వారా గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్ రెడ్డి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరుతున్న ఐఎస్ సదన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నసుందర్ రెడ్డి

## రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి



తెలుగు భాషా సాహిత్యానికి విశేష సేవలందిస్తున్న మంగారి రాజేందర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రశంసించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ' నేను నా రచనలు ' శీర్షికతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం కథా రచయిత, తెలంగాణ జ్యూడిషియల్ అకాడమీ డైరక్టర్ మంగారి రాజేందర్ (జింబో) పాల్గొని తన స్వీయ జీవితం, సాహిత్య ప్రస్థానం వివరించారు. అధ్యక్షోపన్యాసం చేసిన ఆచార్య శివారెడ్డి న్యాయవాద వృత్తితో పాటు తెలుగు భాషా సాహిత్యాలలో ప్రావీణ్యం సంపాదించిన రాజేందర్ ఎందరికో మార్గదర్శకంగా నిలిచారన్నారు. తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్, పరిషత్తు ప్రధాన కార్యదర్శి జె. చెన్నయ్య.. జింబో కలం పేరుతో రచనలు సాగిస్తున్న రాజేందర్ రావిశాస్త్రి తర్వాత రచనా స్వభావం రీత్యా గణనీయులని కొనియాడారు. **- తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 23**

## సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌పై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు

సిటీబ్యూరో, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌పై చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని సౌత్ ఈస్ట్‌జోన్ డీసీపీ రోహిత్‌రాజ్ తెలిపారు. 21వ తేదీ రాత్రి సంతోష్‌నగర్ ఇది బజార్‌లో అక్బరుద్దీన్ ఓవైసీ బహిరంగ సభలో మాట్లాడుతుండగా.. సమయం అయిపోయిందంటూ పోలీసులు వస్తున్నారని పరుష పదజాలంతో మాట్లాడుతూ పోలీసులపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్టేజీపైకి వచ్చి పోలీసులు తమ ప్రసంగాన్ని ఆపేందుకు ప్రయత్నించారంటూ అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలపై నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండీల్య బుధ, గురువారాలలో విచారణ చేపట్టారు. పోలీసుల వద్ద ఉన్న వీడియోలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, మీడియా ఛానల్స్, ఎస్బీ సమాచారం, స్మార్ట్ మీడియా ద్వారా జరిగిన ఘటనపై విచారణ చేశారు. ఇన్‌స్పెక్టర్ డయాస్‌పైకి ఎక్కినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని, అక్బరుద్దీన్ చేసిన ఆరోపణలు అవాస్తవమని వెల్లడయ్యిందన్నారు. అయినా కూడా పోలీసులు డయాస్ ఎక్కినట్లు ఆధారాలు సమర్పించేందుకు నోటీసులు ఇస్తామన్నారు. ఇందులో మిగతా దర్యాప్తు పూర్తయ్యిందని, పోలీసులు డయాస్ ఎక్కలేదని తేలిందన్నారు.



పాతనగరంలో ఎంఐఎం జెండా ఎగురవేస్తాం అని ఎంఐఎం యాకుత్‌పుర ఎమ్మెల్యే అభ్యర్థి జాఫర్ హుసేన్ అన్నారు. గురువారం సంతోష్‌నగర్ డివిజన్‌లో ఆయన కార్పొరేటర్ ముజఫర్ హుసేన్‌తో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.జాఫర్ హుసేన్ మాట్లాడుతూ.. పాతనగరంలో అభివృద్ధి పనులు చేపట్టామని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఎంఐఎం యాకుత్‌పుర ఇన్‌చార్జి యాసర్ ఆరాఫత్ , కార్పొరేటర్లు సమీనాబేగం, నాయకులు షర్వత్, షేబాజ్ ప్రచారంలో పాల్గొన్నారు. **- మాదన్నపేట, నవంబర్ 23**

# అభివృద్ధి చూసి ఓటు వేయండి





మాధవనగర్ కాలనీలో గ్రూప్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మలక్‌పేట ఎంఐఎం అభ్యర్థి అహ్మద్ బలాల

సైదాబాద్, నవంబర్ 23 : కాలనీవాసులంతా అభివృద్ధి చూసి ఓట్లు వేయాలని ఎంఐఎం మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. గురువారం మాధవనగర్, సలీంనగర్ కాలనీల్లో నిర్వహించిన కాలనీవాసుల గ్రూప్ మీటింగ్‌లకు బలాల ముఖ్య అతిథిగా విచ్చేశారు. మలక్‌పేట నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో తాగు, మురుగునీటి వ్యవస్థ ఆధునీకరించామన్నారు. పార్క్‌లు, ప్లే గ్రౌండ్స్, రోడ్లు, సామాజిక భవనాలను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ప్రజలు మూడుసార్లు గెలిపించారని అందుకు నిదర్శనం తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలని అన్నారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవటంతో గ్రేటర్‌లోనేమొదటిస్థానంలో ఉన్నామని వివరించారు. ఉపాధి అవకాశాలు కల్పించటానికి మలక్‌పేట బీ–బ్లాక్‌లో ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. చంచల్‌గూడ డిగ్రీ కాలేజ్‌ను ఏర్పాటు చేశామని, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసి ఉత్తమ విద్యను అందిస్తున్నామని తెలిపారు. గాలిపటం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. విద్యావంతులైన కాలనీవాసులందరూ బాధ్యతయుతంగా, స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓటింగ్ శాతం పెంచటంతో పాటు ఓటు హక్కును ఉపయోగించుకోవటంతోనే అభివృద్ధిని ప్రశ్నించే హక్కు వారికి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఆదరించి మళ్లీ గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మలక్‌పేట, నవంబర్ 23 : ప్రజలు కోరిన విధంగా నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి పరిచానని, ఆదరించి మరోసారి గెలిపిస్తే సమస్యలు లేని ఆదర్శంగా నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పాత మలక్‌పేట డివిజన్‌లోని వాహెద్‌నగర్, ఫల్ఫలా మసీదు, సాద్ యే మసీదు వీధుల్లో, మహరాజ హోటల్, తీగలగూడ ప్రాంతాల్లో డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.



వాహెద్‌నగర్ కాలనీలో తనకు ఓటేసి గెలిపించాలని కోరుతున్న ఎంఐఎం మలక్‌పేట అభ్యర్థి, ఎమ్మెల్యే అహ్మద్ బలాల

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రగతి జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామినేని దవాఖాన సౌజన్యంతో గురువారం లక్ష్మినగర్ సాయి బాబా ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సాయి బాబా ఆలయ కమిటీ ట్రస్ట్ మెంబర్ నేరెళ్ల ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కాలనీవాసులు, భక్తులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. కామినేని దవాఖాన వైద్యులు ప్రశాంత్, ఫణి, సిస్టర్స్ ప్రతిభ, శిరీష, హదస్స, బాలకృష్ణ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో నాగమల్ల అనిల్‌కుమార్, సాయిబాబా దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. **- సైదాబాద్, నవంబర్ 23**

## స్నూకర్ అకాడమీ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి

మాదన్నపేట, నవంబర్ 23 : స్నూకర్ అకాడమీ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 28 మందిని అరెస్ట్ చేసిన ఘటన ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఐఎస్ సదన్ చౌరస్తా, మందిర్ మస్జీద్ వద్ద కొన్ని నెలల నుంచి గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా స్నూకర్ అకాడమీ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సమాచారం అందడంతో బుధవారం రాత్రి దాడి చేసి 28 మంది అదుపులో తీసుకొని పీఎస్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశం తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్ డిసెంబర్ 30కి మార్పు

నాంపల్లి కోర్టులు, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ లోక్ అదాలత్ తేదీని డిసెంబర్ 30కి మార్చుతూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 9న జరగాల్సిన లోక్ అదాలత్‌ను ఎన్నికల సందర్భంగా మార్పు చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు పోలీసు అధికారులు అందుబాటులో ఉండకపోవడం వల్లే తేదీని మార్పు చేశారు.

### మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు



| కూరగాయలు | కిలో రూ. | కూరగాయలు | కిలో రూ. |
|---|---|---|---|
| ఆలుగడ్డ | 20 | సొరకాయ | 10 |
| టమాట | 24 | క్యాబేజ్ | 12 |
| వంకాయలు | 30 | క్యారట్ | 35 |
| బెండకాయ | 20 | క్యాలీఫ్లవర్ | 20 |
| మిర్చి | 50 | దొండ | 16 |
| గోకరకాయ | 30 | కీర | 20 |
| చిక్కుడు | 50 | దోసకాయ | 16 |
| బిన్నీస్ | 60 | క్యాప్సికమ్ | 35 |
| బీరకాయ | 20 | బీట్‌రూట్ | 20 |
| కాకరకాయ | 20 | | |

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు